# రూ.13 కోట్లకు ఐపి టోపీ!

**ఇల్లు దుకాణం వదలి వ్యాపారి పరారీ- ఇంటి ముందు బాధితుల ధర్నా**


వ్యాపారి ఇంటి ముందు ధర్నా చేస్తున్న బాధితులు

పలమనేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: పలమనేరు పట్టణంలోని పల్లెవీధికి చెందిన వ్యాపారి వెంకట్రావు రూ.13.14 కోట్లకు ఐపి దాఖలు చేశాడు. ఇల్లు దుకాణం వదలి భార్య పిల్లలతో రాత్రికి రాత్రి పరారీ అయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం వ్యాపారి ఇంటి ముందు ధర్నా చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 30 ఏళ్ళ క్రితం వెంకట్రావు అనే వ్యాపారి పలమనేరుకు వచ్చి చిన్న కిరాణా దుకాణం పెట్టుకున్నాడు. దుకాణం పక్కనే ఇల్లు కూడా అద్దెకు తీసుకున్నాడు. చుట్టుపక్కల వారితో పాటు ఇతర దుకాణాల వారితో పరిచయాలు పెంచుకొని క్రమంగా చీటీల వ్యాపారం ప్రారంభించాడు. తొలుత లక్ష, రెండు లక్షలు రూ.5 లక్షలతో చీటిలు ప్రారంభించి క్రమంగా రూ.10 లక్షలు. రూ.15 లక్షల చీట్లతో వివిధ రకాలుగా రూ.15 కోట్ల వరకు వ్యాపారం పెంచుకున్నాడు. ఐతే 6 నెలల నుండి చీటీలు తీసిన వారికి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేశాడు. ఇదిగో అదిగో అంటూ కొంత సమయం ఇవ్వాలని మోసం చేయనని అందరినీ నమ్మించాడు. దీంతో చీటీలు కట్టిన వారు కూడా కొంత సమయం ఇచ్చారు. క్రమంగా డబ్బులు రాకపోవడంతో బాధితులు అనుమానం వచ్చి నిలదీసే సరికి రాత్రికి రాత్రే దుకాణం మూసి వేసి భార్య పిల్లలతో పరారీ అయ్యాడు. రెండు రోజుల క్రితం బాధితులు కొంతమందికి ఐపి నోటీసులు చేరాయి. 71 మందికి రూ.13.14 కోట్లు అప్పు ఉన్నట్లు తాను ఈ అప్పు చెల్లించలేనని ఐపిలో పేర్కొన్నాడు. ఐతే అనధికారికంగా ఇంకా ఎంతో మందికి అప్పులు ఉన్నాయని కేవలం తెలిసిన వారు నమ్మకమైన వారి పేర్లు మాత్రమే సూచిస్తూ ఐపి నోటీసులు పంపారని బాధితులు ఆరోపించారు. రూపాయి రూపాయి కూడబెట్టి పిల్లల చదువులకు, పెళ్ళిళ్ళకు ఉపయోగపడు తుందని చీటీలు వేశామని ఇంత మోసం చేస్తాడని ఊహించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.




# మేనిఫెస్టోలో ప్రకటించిన... హామీలన్నీ నెరవేర్చాలి

**-రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయు డిమాండ్ -25న చలో విజయవాడకు పిలుపు**



పెనగలూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి అల్లం అశోక్ కుమార్ డిమాండ్ చేసారు. శనివారం సాయంత్రం పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 25వ తేదీన చేపట్టిన చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి పెనగలూరు మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పెన్షనర్ల ఉపాధ్యాయుల దీర్ఘ కాల ఆర్థిక బకాయిలను అన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయులకు భోధనేతర పనుల నుండి విముక్తి కల్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ జి. శ్రీనివాసులు, కోటపాటి యానాదయ్య, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరాపల్లి శివారెడ్డి, కోడూరు రీజినల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, ఎస్టియు మండల ప్రధాన కార్యదర్శి రాము, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మండల గౌరవ అధ్యక్షులు శేషారెడ్డి, మండలంలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కన్నుల పండువగా...

# కైలాసనాధుని పల్లకి సేవ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి గ్రామోత్సవం పల్లకి సేవ. ఈ సేవకు గతంలో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఉత్సవాలు మొక్కుబడిగా ఊరేగింపులకే పరిమితమౌతున్న దశలో పల్లకి సేవ కూడా స్థానికులకే పరిమితమైంది.

**అలిగిన వేళనే చూడాలి...**

అలిగిన అమ్మవారిని బుజ్జగిస్తూ, ప్రాధేయపడుతూ వెంబడించిన సోమస్కంద మూర్తి ఘట్టం భక్తులను ఎంతగానే ఆకట్టుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 12వ రోజు నిర్వహించే గ్రామోత్సవం పల్లకిసేవ. సాధారణంగా ఎవరైనా అలిగితే, కోపబడితే కళ్ళు ఎర్రబడడం సహజం. మోహం ఎర్రగా మారిపోతుంది. అయితే జగన్మాత అసురసంహారిని అయిన ఆదిశక్తి ఆగ్రహించిన వేళ ఆమెను చూడడం ఎవరికైనా సాధ్యమా? సాహసమా? అందుకే అలిగిన ఆదిశక్తి ముందు పల్లకిలో వెళ్ళగా ఆమెను బుజ్జగిస్తూ సోమస్కంద మూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుడు వెంబడించడం పల్లకి సేవ పరమార్థం. ఈ ఘట్టం రమణీయంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయం జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కైలాసనాధుని పల్లకి ఉత్సవం అంగరంగవైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించుటకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. దాంతో నాల్గుమాడావీధుల్లో ఎటు చూసినా ఇసుకేస్తేరాలనంత రద్దీ ఏర్పడింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో అత్యంత శోభాయమానంగా నిర్వహించే ఉత్సవాల్లో పల్లకి సేవ ఒకటి. ఈ ఉత్సవాన్ని స్థానిక ఉత్సవంగా నిర్వహిస్తారు. సోమవారం సాయంత్రం ఆలయంలోని అలంకార మండపంలో సోమాస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుని ఓ పల్లకిలో ముస్తాబు చేశారు.


పల్లకి సేవలో స్వామి అమ్మవార్లు



అలాగే మరో పల్లకిలో దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని చక్కగా అలంకరించి ప్రతిష్ఠించారు. స్వామి వారి పల్లకిలో అద్దం ఏర్పాటు చేశారు. ముందు స్వామి వారి పల్లకి వెళుతుండగా వెనుక అమ్మవారి పల్లకి సాగింది. అద్దంలో అమ్మవారి తేజస్సును దర్శించుకుంటూ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవాల్లో ఇది చివరి ఉత్సవం కావటంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. తేరువీధిలో ఇసుకేస్తేరాలనంత రద్దీ ఏర్పడింది. బోయిలు స్వామి అమ్మవార్ల పల్లకీల్ని మోసుకుంటూ వెళుతుండగా భక్తులు హారతులిస్తూ ముందుకు సాగించారు. స్వామి అమ్మవార్ల తేజస్సును తిలకించుటకు వేయికళ్ళు అయినా చాలవన్నట్లు ముస్తాబు చేశారు. పల్లకిలకు విద్యుత్ దీపాలు పూలతో ముస్తాబు చేశారు. స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ రాజేష్, సూరిబాబులు ముస్తాబు చేయగా ఉత్సవాన్ని ఆలయ ఇఓ ప్రాంభించారు. ఇఇ శ్రీనివాసులురెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు పర్యవేక్షించారు. రాత్రి 9గంటలకు ఆలయం నుంచి స్వామి అమ్మవార్ల పల్లకి ఉత్సవం ప్రారంభం అయ్యింది. ఇఓ ఉత్సవాన్ని సకాలంలో నిర్వహించుటకు చొరవ చూపారు. ఉత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

## రెండు యూనివర్శిటీలతో ...

# విద్య, ఉపాధి కేంద్రంగా చిత్తూరు

**- చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల**


చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఎస్‌ఏవై సేవారత్న మొదటిక్షేత్రస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: చిత్తూరు యువత ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రెండు యూనివర్సిటీల ఏర్పాటు రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వఎమ్మెల్యే అభ్యర్థిగా ఇచ్చిన హామి మేరకు త్వరలో తీరనున్నాయని చిత్తూరునియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం విజయం ఇంజనీరింగ్ కళాశాల నందు జరిగిన చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఎస్‌వివై సేవారత్న మొదటిక్షేత్రస్థాయి సమావేశంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్లప్రసాదరావుతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలకు కట్టుబడుతూ చిత్తూరులో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఇప్పటికే అసెంబ్లీలో ప్రకటన చేయడం జరిగిందనీ, కేంద్రీయ విద్యాలయం అడ్మిషన్లు ఈ సంవత్సరం నుంచే ప్రారంభం అవుతాయన్నారు. అలాగే పివికెయన్ కళాశాలలో వ్యవసాయవిశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు దాదాపుగా పూర్తికావచ్చాయని త్వరలో అధికారిక ప్రకటన వస్తుందన్నారు. చిత్తూరు మీదుగా చెన్నై, బెంగళూరు మహానగరాల మధ్య బుల్లెట్ ట్రైన్ మంజూరు అయ్యిందని, ముఖ్యంగా రెండు ఎక్స్‌ప్రెస్ హైవేలు, బుల్లెట్ ట్రైన్, యూనివర్శిటీల రాకతో భవిష్యత్తులో చిత్తూరు విద్య, ఉపాధి కేంద్రంగా మారుతుందన్నారు. ఈ సమావేశంలో మేయర్ అముద, విజయం ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు, డా.ఎం.శైలజ, సీఎస్‌సిడిఎస్ అధ్యక్షులు తాండవమూర్తి, సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి సీనియర్ల మనోగతం కష్టపడ్డవారిని పట్టించుకోలేదనే అంతర్మథనం**

## దమ్ము కాదు...

# డబ్బుంటేనే పదవులిస్తారా!?



ప్రభాతవార్త-తిరుపతి: పార్టీకోసం కష్టపడ్డవారికి...జెండా మోసిన వారి సేవలు మరచిపోలేమని... వారికి తగిన గుర్తింపునిస్తామని అధినేత, సిఎం చంద్రబాబునాయుడుతో సహా యువనేత, మంత్రి నారాలోకేశ్ చెబుతున్నా ఆచరణలో అమలుకావడం లేదని టిడిపి సీనియర్లు ఆవేదన వెల్లగక్కుతున్నారు. జిల్లాస్థాయిలో పార్టీని ధీటుగా నడిపించే దమ్మున్న నాయకుడు అవసరం లేదని, డబ్బున్న వారికే పదవులు కట్టబెట్టేలా పరిస్థితి మారిందని ఎంతోమంది సీనియర్ నేతలు బహిరంగంగా అంతర్మథనం చెందుతున్నారు. గతంకంటే ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉమ్మడి చిత్తూరుజిల్లాలో టిడిపిలో కొత్త ఒరవడి కనిపిస్తోందనేది తెలుగుతమ్ముళ్ళ ఆవేదన. ఒకప్పుడు పార్టీలో దమ్మున్న నాయకులకు పార్టీ పదవులు ఇచ్చారని, ఇప్పుడు డబ్బున్నవారికి నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని వాదన బలంగా వినిపిస్తోంది. గత వైసిపి ప్రభుత్వంలో టిడిపిలో ఉండి పార్టీకోసం కష్టపడిన సీనియర్ నేతలు ఇప్పుడు ఎక్కడ ఉన్నారనేది కనిపించడం లేదని పార్టీలో గుసగుసలు. గతంలో టిడిపి అధికార ప్రతినిధులుగా ఉన్న డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ సప్తగిరిప్రసాద్‌ల పరిస్థితి అలాగే తయారైంది. గతంలో మంత్రులను కూడా ధీటుగా విమర్శలు చేసిన ఈ ఇద్దరు నాయకులు పార్టీలో నామమాత్రంగా ఉంటున్నారు. కుప్పం నియోజకవర్గంలో గత ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు పార్టీలో ఉన్నారా లేదా అనేది తెలుగుతమ్ముళ్ళు అనుమానంలో ఉన్నారు. తిరుపతిలో సీనియర్ నాయకుడు సూరా సుధాకర్‌రెడ్డి తుడ ఛైర్మన్ పదవి కోసం పలుమార్లు అధినేత చంద్రబాబును కలసినా ప్రయోజనం లేదనది పార్టీలో గుప్పుమంటోంది. వైసిపి నుండి వచ్చిన దివాకర్‌రెడ్డికి అనూహ్యంగా పార్టీలో సభ్యత్వంతో తుడ ఛైర్మన్ పదవిని కట్టబెట్టడం, టిటిడిలో ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా అవకాశంతోబాటు తిరుపతి పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. తిరుపతి నియోజకవర్గంలో సీనియర్ నేతలు బి.శ్రీధర్‌వర్మ, మబ్బుదేవనారాయణరెడ్డి, వి.పుష్పావతియాదవ్, దంపూరి భాస్కర్, బుల్లెట్‌రమణ, వట్టికుంట శంకరనారాయణ, కంకణాల రజనీకాంత్‌నాయుడు వంటి నేతలు నిరాశతో ఉన్నారు. తిరుపతికి చెందిన సుగుణమ్మ, నరసింహయాదవ్ రాష్ట్రపదవుల్లో కేవలం ఉనికి చాటుకుంటున్నారు తప్ప వైసిపి నేతల వ్యాఖ్యలను ధీటుగా ఎదుర్కోలేకపోతున్నారు. పార్లమెంట్ పరిధిలో నాయకులు చురుకైన పాత్ర పోషించాలన్నా పట్టించుకునేవారే లేకపోతుండటంతో ఎవరికివారే అన్నట్లు పార్టీలో ఉంటున్నారు.

## ప్రపంచంలో సేవలు-సాంకేతికతల్లో ...

# అపోలోకు అగ్రస్థానం

**- అపోలో గ్రూప్ సంస్థల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి**



ది అపోలో యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: సేవలు, సాంకేతికతల అంశంలో అపోలో ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిందని అపోలో గ్రూప్ సంస్థల ఛైర్మన్, ది అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. చిత్తూరు మురకంబట్టు అపోలో యూనివర్సిటీ నాలెడ్జ్ సిటీ ప్రాంగణంలో శనివారం ది అపోలో యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సంపాదించిన జ్ఞానంను సమాజ సేవకు వినియోగించాలన్నారు. 43 సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య సేవలతో ప్రారంభమైన అపోలో సంస్థ నేడు సేవలు, సాంకేతికత, వైద్య ఫలితాల్లో ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. చిత్తూరులోని ది అపోలో యూనివర్సిటీ మూడు సంవత్సరాల్లోనే విశేష పురోగతి సాధించి, కొత్త కోర్సులు ప్రారంభించి, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచంలోనే లక్షలాది హృదయ శస్త్ర చికిత్సలు నిర్వహించి అపోలో సంస్థ అగ్రస్థానంలో నిలిచిందని, ప్రోటాన్ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ చికిత్సలో దేశానికి దిశా నిర్దేశం చేస్తోందని ఆయన వివరించారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ డాక్టర్ కెఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర అధ్యయనం, సాంకేతిక పరిజ్ఞానం, నైతిక విలువలను సమన్వయం చేసుకుని భవిష్యత్తు సవాళ్ళను ఎదుర్కోవాలని సూచించారు. అపోలో సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళిన డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు, సాంకేతికత వేగంగా విస్తరిస్తోందన్నారు. స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన వందలాది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో నాలెడ్జ్ సిటీ సిఇఓ శివరామకృష్ణన్, వెంకటేశ్వరన్, డాక్టర్ రవిరాజు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పోతరాజు, డీన్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**అస్త్రా క్రీడా సముదాయం ప్రారంభం**

అపోలో నాలెడ్జ్ సిటీ ప్రాంగణంలో అస్త్రా-అపోలో స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ అరేనాను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ప్రీతారెడ్డి హాజరయ్యారు. అస్త్రా ప్రధాన సముదాయంతో పాటు బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్ మైదానాలను ప్రారంభించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు కీలకపాత్ర వుందని, ఆరోగ్యకర జీవనశైలికి క్రీడలు అవసరమని డాక్టర్ ప్రీతారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గల్లా కుటుంబం సేవ అభినందనీయం

**-కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.**

రేణిగుంట ఫిబ్రవరి 21 ప్రభాతవార్త సమాజానికి గల్లా కుటుంబం చేస్తున్న సేవలు అభినందనీయమని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజ ప్రాంగణ ఆడిటోరియం నందు శనివారం కృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘం స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రముఖ సినీ నటుడు మాజీ రాజ్యసభ సభ్యులు మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల రామ్మోహన్, అమర రాజ గ్రూప్ ఛైర్మన్ మాజీ ఎంపీ గల్లా జయదేవ్, అమర రాజ గ్రూప్ ఫౌండర్ ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, సంస్థ అధ్యక్షురాలు రమాదేవి గౌరినేని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సినీ నటుడు మురళీమోహన్ సంయుక్తంగా మాట్లాడుతూ ఎంతోమంది నిరుద్యో గులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న గొప్ప సంస్థగా అమరాజాను అభివర్ణించారు. ప్రతిభావంతులైన గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిది చిన్నచిన్న గ్రామాల్లో కూడా యువత ద్వారా పరిశ్రమలు ఏర్పాటుకు దోహదం చేస్తున్న అమరరాజ గ్రూప్స్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. రచయిత శాకం నాగరాజు రచించిన ప్రజల మనిషి రాజన్న పుస్తకాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వహస్తాలతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమస్త సెక్రటరీ మహదేవ నాయుడు, ఉపాధ్యక్షుడు ఉమాకాంత్, ట్రెజరర్ రాళ్ళపల్లి సతీష్, సంయుక్త కార్యదర్శి బాలాజీ కిరణ్, అమరరాజ ఉద్యోగులు పాల్గొన్నారు.

# చంద్రగిరి నియోజకవర్గంలో మట్టి దోఫిడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**-కలెక్టర్ విచారణకు ఆదేశం... మట్టి, ఇసుక అక్రమ రవాణాపై చర్యలు**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మట్టి, అక్రమ ఇసుక వ్యాపారాలపై చర్యలు తీసుకోకపోతే అందోళనలు చేపడతామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. శనివారం పెరుమాళ్ళపల్లికి విచ్చేసిన కలెక్టర్‌కు తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, వైసిపి మండలాధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి, సర్పంచ్ జోగి మోహన్‌లు అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలపై ఆధారాలను సమర్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 25ప్రాంతాల్లో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోఫించారు. తవ్వకాలపై తీసిన ఫోటోలు, వీడియోలను కలెక్టర్‌కు చూపిస్తూ దళవాయి చెరువు పరిసర ప్రాంతాలను ప్రత్యక్ష్యంగా పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ ఒక వారంరోజుల్లో అక్రమ తవ్వకాలు ఆపకపోతే తమన నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యక్ష అందోళనలు చేస్తామని తెలిపారు. స్థానికులను భాగస్వామ్యం చేస్తూ అన్ని ప్రాంతాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైసిపి నాయకుల ఫిర్యాదు స్పందంచిన కలెక్టర్ సమగ్ర విచారణ నిర్వహించి అక్రమ తవ్వకాల్లో పాల్గొన్న వారిపై తప్పకుండా కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మట్టి దోఫిడి అంశం ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది

# మనస్తాపంతో భార్య... ఆపై భర్త ఉరేసుకుని ఆత్మహత్య!

**- కుప్పం మండలం వేపూరులో ఘటన !**

కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: మద్యంకు అలవాటుపడిన భర్త తరచూ గొడవపడడం తట్టుకోలేక ఓ భార్య మనస్తాపంకు గురై మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా ఆమె భర్త సైతం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వేపూరులో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ సిఐ శంకరయ్య తెలిపిన మేరకు వివరాలిలా.. వేపూరు గ్రామంలో రామప్ప (60), అతని భార్య మల్లమ్మ నివాసం ఉంటున్నారు. వీరికి ఆరుమంది సంతానం. ఐదుమంది ఆడ పిల్లలకు వివాహం చేశారు. కుమారుడు పాల వ్యాపారం చేస్తున్నాడు. కాగా మద్యానికి అలవాటు పడిన రామప్ప తరచూ భార్యతో గొడవ పడేవాడన్నారు. దీంతో మనస్తాపంకు గురైన మల్లమ్మ గ్రామ సమీపంలోని మామిడితోటకు వెళ్లి తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇది గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారన్నారు. అంతలోనే రామప్ప కూడా ఈ విషయంగా అందరూ తనను ప్రశ్నిస్తారని భావించి అతను కూడా చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ


ఆత్మహత్య చేసుకున్న భార్యభర్తలు ఎల్లమ్మ, రామప్ప

## మామిడి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



**తవణంపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మామిడి పంటకు ప్రస్తుత సమయంలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించ వచ్చునని జిల్లా ఉద్యానశాఖ డీడీ పి.రామాంజ నేయులు తెలిపారు. శనివారం మండలంలోని వెంగంపల్లె గ్రామంలో మామిడి రైతులకు పూత, పిందె దశలోచేట్టవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు ఉద్యానశాఖ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చిత్తూరు డాట్ సెంటర్ చిత్తూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు, ఉద్యానశాఖ ఏడీ యు.కోటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రస్తుత పూత పిందె దశలో మామిడి తోటలకు తేలికపాటి నీటి తడులు ఇవాలని సూచించారు. ఈకార్యక్రమంలో బంగారుపాళ్యం ఉద్యాన అధికారి డి.సాగరిక,మామిడి రైతులు పాల్గొన్నారు.

## పల్లెనిద్ర కార్యక్రమం



**పూతలపట్టు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూది ఆదేశాలు మేరకు పూతల పట్టు కాలనీ నందు పల్లెనిద్ర కార్యక్రమం పూతలపట్టు సిఐ గోపి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్య స్పర్శ, మహిళలు చిన్నపిల్లలు పట్ల జరిగే నేరాలు, సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాల వినియోగం, దాని వలన కలిగే నష్టాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాలు యొక్క ఉపయోగం మరియు పోలీసులు ప్రజల మధ్య స్నేహపూర్వకమైన సంబంధములు పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు కాలనీకి చెందిన గ్రామస్తులు సుమారు 50 మంది పాల్గొన్నారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు



– ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు

**చిత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు పడుతాయని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శనివారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా కార్యక్రమంను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు జ్యోతి ప్రజ్వలింపజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సిఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కార్పొరేటర్ అశోక్, మెప్మా అధికారులు, పెద్ద ఎత్తున యువతీయువకులు పాల్గొన్నారు.

## పల్లెలు పరిశుభ్రంగా వుంచడమే లక్ష్యం



**గుడిపాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా వుంచడమే లక్ష్యంగా రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం విధులు నిర్వహిస్తోందని ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడులు పేర్కొన్నారు. నారగల్లు గ్రామ సచివాలయంలో శనివారం ఎంపిడిఓ శిరీషతో కలిసి ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడులు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో స్వచ్ఛ రథంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు రూప్‌కుమార్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 21 ప్రభాత వార్త:** ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మాతృభాష ఆత్మ స్వరూపం వంటిదని, భావవ్యక్తీకరణకు ప్రధాన సాధనమని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు భీమన్న, లోకనాథ మందడి, వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎస్పీడబ్ల్యూ జెసిలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భాష మానవజాతి పెంపొందించుకున్న ఒక శక్తివంతమైన సాధనమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ జయమ్మ, కల్పన, మునేంద్ర, ధనమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెలవు రోజునా హాల్ టికెట్‌లు జారీ

**తిరుపతి విద్య,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ఎస్వీయూ పరిధిలో ఈనెల 26 నుంచి జరగనున్న ఇయర్లీ ప్యాటర్న్ సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు ఆదివారం సెలవు రోజు సైతం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎగ్జామినేషన్ సెక్షన్లో హాల్ టికెట్ లు జారీ కొనసాగుతుందని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు.డీన్ ప్రొఫెసర్ సురేంద్రబాబు,వీసీ నర్సింగరావు ఆదేశాల మేరకు అభ్యర్థుల సౌకర్యార్థం ఈ వెసులుబాటు కల్పించామని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని హాల్టికెట్లను పొందాలని సూచించారు.

# రైల్వే కోడూరు డివిజన్

## పంతగానికి కళాశ్రీ అవార్డు



**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రైల్వేకోడూరు టిడిపి యువ నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్‌కు ఘనంగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు చేతుల మీదుగా సన్మానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంతగాని నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు కవుల సమ్మేళనంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా కళాశ్రీ అవార్డును స్వీకరించినట్లు పంతగాని తెలిపారు. ఈ అవార్డు అందజేసిన కళాశ్రీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలను పంతగాని తెలియజేశారు.

## పేదలకు అన్నదానం



**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రైల్వే కోడూరు మండలంలోని టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపనందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని రైల్వేకోడూరు పట్టణంలోని టోల్గేట్ వద్ద వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కొప్పరపు, శంకర్, భుజంగేశ్వర దేవాలయం చైర్మన్ ఉంగరాల సురేంద్ర కుమార్, చిన్న, నాని, హరి, జస్వంత్ రెడ్డి, మోహిత్ మరియు సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ సెక్రెటరీగా ఇనమాల



**రైల్వే కోడూరు,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ సెక్రెటరీగా రైల్వే కోడూరు వైసీపీకి చెందిన సీనియర్ నేత ఇనమాల మహేష్ ను ఎంపిక చేసినట్లు శనివారం విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఇనమాల మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డికి, కోడూరు పార్టీ నాయకులకుప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఇనమాల మహేష్ తెలియజేశారు.

## పిచ్చి కుక్క వీరంగం



**పలమనేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పలమనేరు పట్టణంలో ఓ పిచ్చి కుక్క వీరంగం చేసింది. అడ్డంగా వచ్చిన వారినంతా కాటువేసి తీవ్రంగా గాయపరచింది. శుక్రవారం రాత్రి ఎంసి పాళ్యంలోని ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఎస్‌బిఐ ఎటిఎం గల వీధిలో పిచ్చి కుక్క హటాత్తుగా వచ్చింది. రిషిత (10) అనే చిన్నారి ఎదురుగా వున్న దుకాణానికి వెళ్ళి తిరిగి వస్తుండగా దాడి చేసింది. మోకాలు పైభాగంలో పట్టుకొని కొరికి కండ బయటపడేలాగా కొరికి వేయడంతో రక్త గాయాలతో ఉన్న పాపను ఆసుపత్రి తరలించారు. ఇదే పిచ్చి కుక్క రాఘాక్రిష్ణయ్య వీధిలో ప్రవేశించి కనిపించిన వారినంతా గాయపరచింది. దీంతో అప్రమత్తమైన యువకుడు అక్కడే ఉన్న బండరాయి తీసుకొని కుక్క తలపై బలంగా మోదాడు. దీంతో అక్కడి కక్కడే కుక్క పడిపోయి విలవిలలాడుతుండగా ఇతర యువకులు వచ్చి చితకబాది చంపేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమీషనర్ కెవి రమణారెడ్డి సిబ్బందిని పంపి మృతిచెందిన కుక్కను దూరంగా తీసుకు పోయి పూడ్చి వేశారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపి, ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పాలకసంస్థ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు ప్రారంభించారు. శనివారం ఉదయం 4వ వార్డు కట్టమంచి లాయర్స్‌కాలనీలో రూ. 19.30లక్షలతో చేపట్టిన సిమెంట్‌రోడ్డు, కాలువ, లాయర్స్‌కాలనీ ఎక్స్‌టెన్షన్‌కు వెంకటరమణ నగర్‌గా నామ శిలాఫలకాన్ని ప్రారంభించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జీలు, తెదేపా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా గవర్నమెంట్ ప్లీడర్‌కు సత్కారం



**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** జిల్లా ప్రభుత్వప్లీడర్‌గా నియమితులైన గోవిందరాజులను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కీసరం పరంజ్యోతి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. అలాగే ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావును ప్రభుత్వ ప్లీడర్‌తో కలసి వెళ్లి ఎస్సీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శివయ్య, లీగల్ ఆఫీసర్ వెంకటేష్, సత్యం, శాంసన్, పంచాయతీ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయుల వసతిగృహ సందర్శన



**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, మెప్మా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న కట్టమంచి నిరాశ్రయుల వసతిగృహాన్ని ఆర్కే విద్యాలయ డిగ్రీ విద్యార్థులు ఫ్యాకల్టీ వినోద్‌తో కలసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జోసప్‌రాజు నిరాశ్రయులకు వసతిగృహంలో అందిస్తున్న వసతి గురించి వివరించి, విద్యార్థి దశ నుంచి సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని, తల్లిదండ్రులతో ప్రేమగా మెలగాలని, పేదలకు తమ వంతు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది ప్రమీళ, ఇంద్రాణి, రఘుపతి, విమల తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ



**కాణిపాకం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొదటగా దేవస్థానం అతిథి గృహం వద్ద ఆలయ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఆలయ అధికారులు, సిబ్బందితో కలసి ఆలయ మాఢా వీధులు,బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు.అలాగే పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. దేవస్థానం పరిసరాల్లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని వ్యాపారస్థులను ఛైర్మన్, ఈఓలు ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో ఆలయ ఏఈఓలు ధనంజయ,ఎస్వీ.కృష్ణారెడ్డి హరి మాధవరెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, బాలరంగస్వామి, ఆలయ, పారిశుద్ధ్య సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం



**కాణిపాకం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారం తపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు వారంతపు రోజులు కావడంతో పాటు ఆలయంలో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు.ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం భారీగా తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. అసౌకర్యం కలుగకుండా ఆలయ ఏర్పాట్లు చేపట్టారు.

## స్వచ్ఛతతో వ్యాధులకు చెక్



**గుడిపాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుంటే వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని గుడిపాల పిహెచ్‌సి డాక్టర్ సంధ్య పేర్కొన్నారు .గుడిపాల పిహెచ్‌సి పరిసరాల్లో శనివారం డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో పిహెచ్‌సి సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమహేష్, సిహెచ్‌ఓ సూర్యనారాయణ, సిబ్బంది విజయ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజారెడ్డికి ఘన సన్మానం



**రైల్వే కోడూరు,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రైల్వేకోడూరు లోని వైసిపి సీనియర్ నాయకులు మరియు మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి వైసీపీలో స్టేట్ కౌన్సిల్ మెంబెర్‌గా ఎన్నికైన సందర్భంగా మండలంలోని సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, స్థానిక ఎంపీపీశనివారం రామిరెడ్డి ధ్వజారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎప్పటికీ మరువనని ప్రజాసేవలో అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని రామిరెడ్డి ధ్వజారెడ్డి వారితో అన్నారు.

## ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి.



**చిట్వేలి,ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** హెల్మెట్ వాడకం బరువు కాదు బాధ్యత అని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ధరించాలని రైల్వే కోడూరు రూరల్ సిఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక ఎస్సై వినోద్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారి వెంబడి ప్రజలకు హెల్మెట్ అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ హెల్మెట్ ను ధరించక పోవడం వల్లనే అనేకమంది ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కుటుంబ పెద్దను కోల్పోతే కుటుంబ పరిస్థితి చిన్నభిన్నమవుతుందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, డ్రైవింగ్ సమయంలో ఫోన్లో మాట్లాడడం తదితర చర్యల వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి అలవాట్లను నివారించాలని సూచించారు.అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీస్ శాఖ ప్రజల ప్రాణ భద్రత కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాత నేరస్తులకు పోలీసులు కౌన్సిలింగ్.



**చిట్వేలి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** స్థానిక మండల పరిధిలో గతంలో గంజాయి విక్రయించిన వారు మరియు గంజాయి సేవించిన వారిని గుర్తించి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో రూరల్ సీఐ శ్రీనివాసులు,ఎస్సై వినోద్ కుమార్ తో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. గంజాయి వాడకం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, సమాజ శాంతి భద్రతలపై కలిగే తీవ్రమైన ప్రతికూల ప్రభావాల గురించి వారికి వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని హెచ్చరించి, మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఎంచుకుంటే ఎన్ డి పీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ,ఎస్ఐలు వెల్లడించారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యంత అవసరమని, యువత మంచి మార్గంలో ముందుకు సాగేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిపోలీస్ అధికారులు సూచించారు. స్థానిక పోలీస్ గత నేర ముద్దాయిలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## స్వర్ణపంచాయతీల ప్రణాళికలు రూపొందించాలి



**కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండలంలోని స్వర్ణ పంచాయతీల అభివృద్ధికి తగు ప్రణాళికలు రూపొందించాలని డిప్యూటీ ఎంపిడిఓ రమ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. 2026–27సంవత్సరంకు గాను పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు సమన్వయంతో ప్రణాళికలు తయారు చేయాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలపై శిక్షణ కల్పించారు.

## ఎఐ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించాలి

– కెఇసిలో ఘనంగా డేటా స్టార్మ్ 2క26 సింపోజియం!!



**కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)ను సమర్థవంతంగా ఉపయోగించాలని డాక్టర్ శోభ బిందు సూచించారు. శనివారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించిన డేటా స్టార్మ్ 2క26 సింపోజియంకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భవిష్యత్తులో ఉత్తమ ఉద్యోగాలు సాధించాలంటే సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలన్నారు. కాలేజ్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్‌ఛైర్మన్ సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సదస్సులో దోహదపడ తాయన్నారు. ఈ సింపోజియంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ సింపోజియం పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించలేదని...మండల సమావేశం బహిష్కరణ



**శాంతిపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** గతంలో చేసిన పనులకు సంబంధించి ఎంపిడిఓ ఆదేశించినా కార్యదర్శులు స్పందించి బిల్లులు చెల్లించకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వైఎస్సార్సీకి చెందిన ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు బహిష్కరించారు. శనివారం ఎంపిపి వసుంధర అధ్యక్షతన మండల సమావేశం జరగాల్సి ఉంది.మండలంలోని కర్లగట్ట, సి.బండపల్లి, 64 పెద్దూరు, మొరసనపల్లి, అనికెర, కొలమడుగు పంచాయతీల్లో చేపట్టిన పనులకు ఇంతవరకు బిల్లులు చేయలేదన్నారు. దీంతోపాటు సర్పంచులు, ఎంపిటిసిలకు నాలుగేళ్లుగా గౌరవ వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. దీంతో సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎంపిపి వసుంధర, వైస్ ఎంపిపిలు సరస్వతి, పట్టాభిలతో పాటు పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు పేర్కొంటూ ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

## అగ్నిప్రమాదాల నివారణకు దశల వారీ శిక్షణ

– చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం

**కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రాబోయే వేసవిని దృష్టిలో ఎంచుకుని అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు దశల వారీగా శిక్షణ ఇచ్చినట్లు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం పేర్కొన్నారు. ఈనెల 18–21 తేదీల మధ్య తిరుపతి, చిత్తూరు జిల్లాల అటవీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాల ముగింపు కార్యక్రమం సందర్భంగా రామకుప్పం మండలం ననియాలలో జరిగిన ముగింపు కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల తిరుమల అటవీ ప్రాంతంలో సంభవించిన అగ్నిప్రమాదం సమయంలో హెలికాప్టర్ల సాయంతో పాటు భారత వాయుసేన రంగంలో దిగడంతో పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించామని పేర్కొన్నారు. అలాగే వన్యప్రాణుల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి అనుపమ, డిఎఫ్ఓ సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్లు పావన్ యాదవ్, బిర్తన్ సింగ్, రాజిబ్ దారిపా, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిఐ వెంకటేశ్వర్, ఎఫ్ఆర్వో జయశంకర్, తహశీల్దార్ కౌలేష్, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఎస్సై శ్రీనివాసరావు, బీట్ అధికారులు, ట్రాకర్లు పాల్గొన్నారు.

## భార్య కోసం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం



**చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** తన భార్యను ఇంకొకరు తీసుకొని వెళ్ళి కాపురానికి రానివ్వకుండా చేస్తున్నాడని భర్త అతని దుకాణం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, తర్వాత న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయించిన సంఘటన శనివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుని కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన కృష్ణమూర్తితో తమిళనాడు రాష్ట్రం గుడియాత్త రామాలు గాంధీనగర్ లలితతో 17యేళ్ళ క్రితం వివాహమైంది. ఇదే గ్రామానికి చెందిన భరత్ అనే వ్యక్తి తన భార్యకు మాయమాటలు చెప్పి వలలో వేసుకొని 3యేళ్ళుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని కృష్ణమూర్తి తెలిపాడు. అయిన తన భార్యను పంపితే బిడ్డల కోసం జీవిస్తామని పలు మార్లు వెళ్ళి బ్రతిమలాడినా వెళ్ళనీయకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయాడు.జనసంచారం అధికంగా వున్న ప్రాంతం పెట్రోలు పంపుకు సమీపంలో హఠాత్తుగా కృష్ణమూర్తి ఒంటిపై పెట్రోలు పోసుకోవడంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రజలంతా సంఘటనా స్థలంలో గుమికూడారు.

## చెత్తలేని గ్రామాల దిశగా చర్యలు తీసుకొందాం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చెత్తలేని గ్రామాల దిశగా చర్యలు తీసుకొందామని ఎంపిడిఓ లీలామాధవి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ 2047లో భాగంగా తలపెట్టిన సర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర మేరకు నూతనంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛరథాన్ని స్థానిక పరిపాలనా భవనం వద్ద ప్రారంభించారు. తడిచెత్త, పొడిచెత్తను సేకరించే వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటి వద్దకూ వస్తున్నాయన్నారు. అయితే స్వచ్ఛరథం వచ్చినప్పుడు పొడి చెత్తను అందిస్తే అందుకు తగ్గట్టుగా నిత్యావసర సరుకులందిస్తారన్నారు.డి.ఎంపిడిఓ మస్తాన్, ఇఓఆర్డీ మహేష్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రమాణాలతో దద్దరిల్లిన రాజనాలబండ



**చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండలంలోని సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ ప్రమాణాలతో దద్దరిల్లింది. శనివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం పాలకుడైన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణ గావించాడు. టిటిడి ఆధ్వర్యంలో స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## నేడు ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

**కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం ఏరియా ఆస్పత్రి కమిటీ, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటలనుంచి జరుగుతుందన్నారు. యువత అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు.

## సేవలు అందించడానికి స్వచ్ఛ రథం



**గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమములో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీసీఇఓ రవికుమార్ నాయుడు పచ్చజెండా ఊపి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచన మాట్లాడుతూ ఈ వ్రతం ద్వారా ప్రతి కుటుంబంలోని పనికిరాని వ్యర్థ పదార్థాలను పరిసరాల్లోపడవేయకుండా ఈ రథానికి అందిస్తే దానికి తగిన ధరను చెల్లించడంతో పాటు కుటుంబానికి కావలసిన వస్తువులను కూడా అందిస్తుందని దీనివల్ల పరిసరాలు శుభ్రంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు డిపిఓ సుధాకర్ రావు ఎంపిడిఓ మనోహర్ గౌడ్ నాయకులు పెనుమూరు మార్కెట్ కమిటీ అధ్యక్షులు కృష్ణమ నాయుడు మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ దీపక్ చౌదరి బాబుప్రసాద్ చౌదరి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ హరీష్ యాదవ్ పాడు గోపి ప్రకాష్ రాజేష్ కృష్ణన్‌లతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశుభ్ర రాష్ట్రానికి ప్రతి ఒక్కరు సహకారం

– కలెక్టరేట్ డిటి హరికృష్ణ

**చిత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా వుంచి పరిశుభ్ర రాష్ట్రానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకొని ముందడుగు వేయాలని కలెక్టరేట్ డిటి హరికృష్ణ పేర్కొన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో జీరో లిటర్ గవర్నెన్స్‌పై జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ డిటి హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల థీమ్‌గా జీరో లిటర్ గవర్నెన్స్ అమలవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాపుల చిరకాల ఆకాంక్ష రాయలవారి విగ్రహ ప్రతిష్ట



**చంద్రగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కాపుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేడానికి కృషి చేస్తున్న ఎంఎల్ఏ పులివర్తి నానికి తెలుగుతమ్ముళ్ళు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక రాయలవారి కోట వద్ద శుక్రవారం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు, ఎంఎల్ఏ పులివర్తి నాని చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రాయలవారి కాంస్య విగ్రహాన్ని చంద్రగిరి కోటలో ప్రతిష్టించి, మరింత అభివృద్ధి చేయాలనీ అసెంబ్లీలో ప్రస్తావించిన ఎంఎల్ఏకి రుణపడి వుంటామన్నారు. ఏటా జనవరి 17న శ్రీకృష్ణదేవరాయులు జయంతి వేడుకలను ప్రభుత్వం తరపున నిర్వహించాలని కోరడం శుభపరిణామం అన్నారు. ఎంఎల్ఏ ప్రయత్నం శీఘ్రగతిన కార్యరూపం దాల్చాలని కాపు నాయకులు ఆకాంక్షించారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం..!



-టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వచ్ఛ రత్నం వాహనాన్ని జెండావూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి చెత్తను సేకరించి అందుకు సరిపడా నిత్యవసర సరుకులను ప్రజలకు అందజేస్తారన్నారు. పాత వస్తువుల ధరల పట్టీని వాహనం వద్ద ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పులి రామ్‌సింగ్, డిప్యూటీ ఎంపిడిఓ తేజోవతి, టిడిపి నాయకులు లెక్కల సురేష్‌నాయుడు, బండి విజయ్‌కుమార్ రెడ్డి, ఆకా దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యకర్తలు నిస్వార్ధ సేవకులు

-ఆర్టీసి నెల్లూరు జోన్ రీజినల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** బిజెపి కార్యకర్తలు నిస్వార్ధ సేవకులని ఆర్టీసి నెల్లూరు జోన్ రీజినల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. సి.రామాపురంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ త్రశిక్షణా అభియాన్ 2026 కార్యక్రమం శనివారం జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు జనార్ధన్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కాయం హరినాథ్ రెడ్డి, నాయకులు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కె.వెంకమ్ముని, నాయకులు చంద్రప్ప, నరేంద్రరెడ్డి, వరప్రసాద్, తేజోవతి, డాక్టర్ నరేష్‌బాబు, మునెయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాషను మరువద్దు

పాకాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా మాతృభాషను మరువరాదని పాకాల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా. ఎస్. వి రమేష్ కుమార్ అన్నారు. శనివారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మార్పు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానవక్త వెదురుకుప్పం ప్రభువ్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా. ఎ. సి భరణీనాథ్‌రెడ్డి మాతృభాష బాగా వస్తేనే ఇతర భాషలను నేర్చుకోవడం వీలవుతుందన్నారు. నిత్యం మాట్లాడే భాషలో అవసరం లేకున్నా ఆంగ్లపదాలు వినియోగించడం సరికాదన్నారు. తెలుగు అధ్యాపకులు డా. కె. ఈశ్వరబాబు మాతృ భాషా దినోత్సవం నిర్వహణ వెనుక గల నేపథ్యాన్ని మాతృభాష ప్రాధాన్యతను, అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి అధ్యాపకులు ఆదిశేఖర్ రెడ్డి, రమణమ్మ, రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి కేసు పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు

**సత్యవేడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** సత్యవేడు పోలీసుల ఆధ్వర్యంలో మాధక ద్రవ్యాల అక్రమ రవాణాపై చేపట్టిన చర్యలో భాగంగా సుమారు 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేయడం జరిగింది. 21వ తేదీ మధ్యాహ్నం మాధరపాకం చెక్‌పోస్టు వద్దసత్యవేడు మండలం సత్యవేడు దళితవాడకు చెందిన ఎస్.మహేష్‌ని సత్యవేడు పోలీసులు అరెస్టు చేసి 2 కేజీల గంజాయిని, టీఎన్ 18 సీవై 3695 రిజిస్ట్రేషన్ నెంబరు కలిగిన టీవీఎస్‌స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. సదరు కేసులో సంబంధించిన పరారీలో ఉన్న ఆర్.కాళేపు, కాళయప్పన్‌ని 21వ తేదీ మధ్యాహ్నం సత్యవేడు టౌన్ మాధరపాకం చెక్‌పోస్టు వద్ద సత్యవేడు ఎస్ఐ సాయినాథ్‌చౌదరి అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ప్రజలు మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు.

## కాపర్ వైర్ల దొంగతనానికి పాల్పడ్డ నలుగురు అరెస్టు



**సత్యవేడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** శ్రీసిటీ పరిధిలోని ఎల్జీ పరిశ్రమ వద్ద కాపర్‌వైర్ల దొంగతనానికి పాల్పడ్డ నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు శ్రీసిటీ పోలీసులు వెల్లడించారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... రోజువారి కూలీ పనులకు వచ్చిన వీరు దొంగతనంగా కాపర్‌వైర్లను దొంగలించడం మొదలు పెట్టారు. రహస్యంగా అందిన సమాచారం మేరకు ఎల్‌జీ పరిశ్రమ హెచ్ఆర్ ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీసిటీపోలీసులువీరిపై నిఘా ఉంచి చాకచక్యంగా పట్టుకున్నారు. సత్యవేడు మండలం సిరుణంబుదూరు గ్రామానికి చెందిన కె.రవి(25), ఆర్.చంద్రబాబు(26), జె.సింధు(24), డిల్లీబాబు(30)లను తమిళనాడుకు సరిహద్దు, శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ దొంగతనంపై ఈనెల 19న ఫిర్యాదు అందగా శనివారం అరెస్టు చేసినట్లు వారు వెల్లడించారు. వారి నుంచి సుమారు 2.30 లక్షల విలువైన కాపర్‌వైర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. దర్యాప్తు అధికారికగా ఎస్ఐ సుధీర్‌రెడ్డి వివరించగా ఈ కేసులో ఎత్తిరాజులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## స్వచ్ఛత రథాన్ని ప్రారంభించిన ఎంపీడీవో



**విజయపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్ర శనివారం స్వచ్ఛ రథాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ రథంలో కొబ్బరి నూనె, సబ్బులు, డిటెర్జెంట్‌లు, కిరాణా వస్తువులు నాణ్యమైన ధరలకు దొరుకుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇనుము, పేపర్లు, పాత పుస్తకాలు, అట్ట పెట్టెలు, స్టీల్, అల్యూమినం వస్తువులను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యిలో తప్పు కప్పిపుచ్చేందుకు వైసిపి కుయుక్తులు



**చిట్వేలి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కల్తీ నెయ్యి తప్పుచేసి, కప్పిపుచ్చే ప్రయత్నం వైసిపి చేస్తూ ఉందని మండల టిడిపి బాధ్యుడు కాకర్ల నాగార్జున అన్నారు. శనివారం వైసిపి నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కే.ఎస్ అగ్రహారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ శుక్రవారం అసెంబ్లీ మరియు శాసనమండలి సాక్షిగా వైసీపీ సభ్యులు తమ తప్పును కప్పిపుచ్చుకుని అధికార పార్టీ మీదికి బురదజల్లే ప్రయత్నంలో చెప్పులు వేసుకుని వెంకటేశ్వర స్వామి ప్లకార్డులు ప్రదర్శించడం హేయమైనచర్య అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మోసాటి పెంచల్ రెడ్డి, మన్నూరు సుదీర్ రెడ్డి, మించల బాలకృష్ణ యాదవ్, పగడాల వెంకటేష్, సింగన హరిబాబు, మాచిన సుబ్బ రామయ్య, కో క్లస్టర్ కట్టా గిరి బాబు, బీసీ యూత్ నాయకులు చేతిపట్టు మురళి, హరినాథ్ రెడ్డి, ఉపసర్పంచ్ బాలు రెడ్డియ్య, కస్తూరి శివప్రసాద్ తదితరులు పాల్గున్నారు.

## ఘనంగా సంజీవయ్య జయంతి

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య, పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఎస్ ఎన్ మూర్తి, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ భాగ్యలక్ష్మి, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ భారతి, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ జగదీష్, డాక్టర్ యామిని, డాక్టర్ శివకల, డాక్టర్ లక్ష్మి, ఫార్మాకాలజీ విభాగం, వైద్యులు, వైద్య విద్యార్థులు, ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు తిరుపతి జిల్లా సురేష్ బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూర గిరిబాబు, ఎస్వీ వైద్యకళాశాల విద్యుత్ విభాగం గోవింద్, అనాటమీ విభాగం మురళి, తదుతరులు పాల్గొన్నారు.

## విహారయాత్రలో విషాదం...నీట మునిగి యువకుడు మృతి!



**రేణిగుంట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చెన్నైకికు చెందిన శ్రీనివాసన్ (27) రేణిగుంట మండలం మామందూరు జలపాతంలో ఈత రాక మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా చెన్నై కు చెందిన శ్రీనివాసన్ అతని మిత్రుడు మణికంఠన్ తో కలిసి ద్విచక్ర వాహనంపై రేణిగుంట మండలం మాముండూరు అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న జలపాతం వద్ద ఈత కొట్టడానికి వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటంతో శ్రీనివాసన్ ఈతరాక నీట మునిగి మృతి చెందాడు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జోనల్ స్థాయిలో విజయ్ కుమార్‌కు పదవి



**రేణిగుంట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రేణిగుంట పట్టణానికి చెందిన సిఆర్ఎస్ విశ్రాంత టెక్నీషియన్ విజయ్ కుమార్ కు ఏఐఆర్ఆర్ఎఫ్ జోనల్ స్థాయి నందు ఉపాధ్యక్షుడిగా పదవి లభించింది. ఉద్యోగంలో ఉన్నప్పుడు, విశ్రాంత ఉద్యోగిగా కార్మికులకు చేస్తున్న సేవలను గుర్తించి ఏఐఆర్ఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ అయినకు జోనల్ స్థాయిలో కీలక పదవి ఇచ్చి గౌరవ స్థానాన్ని కల్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ నిరంతరం విశ్రాంత ఉద్యోగుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. ఎనిమిదవ వేతన సంఘంపై ఉన్న బ్యాన్ ను తొలగించాలని ప్రధానమంత్రికి పార్లమెంటు ద్వారా తెలియజేయాలని ఎంపీ గురుమూర్తికి వినతి పత్రం సమర్పించామన్నారు.

## స్వర్ణాంధ్ర సాధనే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



**నాగలాపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తాము వినియోగించి పారివేస్తున్న ప్లాస్టిక్, గాజుసీసా వస్తువులను సేకరించి తమ గ్రామానికి వచ్చే ఈ స్వచ్ఛ రథంకు అందిస్తే వాటికి సరిపడ నిత్యావసర వస్తువులను ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ స్వచ్ఛ రథంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో అధికారులు పిచ్చాటూరు తహసీల్దార్, ఎంపీడీవో, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృభాష దినోత్సవ వేడుకలు



**కేవీబీ పురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పరభాష మోజులో పడి మాతృభాష నిర్లక్ష్యం చేయకండని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వకృత్వ, పద్య పఠన పోటీలు, క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు బాబు, వసుంధరదేవి, రజిత, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు



**కేవీబీ పురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలం కాశి విశ్వనాథపురంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బాలయ్యానాయుడు అమ్మ చెరుకూరు చిన్నక్క(103) మృతి చెందింది. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, జనసేన అధ్యక్షుడు థామస్, నాగరాజురెడ్డి, రమేష్‌లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను మధునాయుడు, సుధలను పరామర్శించారు.

## పరిశుభ్రత చేయాలని తహసీల్దార్‌కి వినతి

**పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రకు తూట్లు పరిశుభ్రత చేయాలని తహసీల్దార్‌కి ప్రజా సంఘాలు వినతిపత్రం అందజేశారు. శనివారం వారు మాట్లాడుతూ పుత్తూరు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చెత్త పిచ్చి మొక్కలు పాతబడిపోయిన వాహనాలు ఎక్కడికక్కడే ఉన్నాయని, ప్రైవేటు వాహనదారులు తహసీల్దార్‌కార్యాలయ ఆవరణలో పార్కింగ్ ప్లేస్‌గా వాడుకుంటున్నారని, ఇతర మండలాల్లో పని చేసే ప్రైవేటు వ్యక్తులు కూడా రాత్రి, పగలు వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఆవరణలో శుభ్రపరచి దోమల మందు కొట్టాలని అనధికారికంగా పార్కు చేస్తున్న వాహనాల్లో అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు మహేష్, ఆర్.వెంకటేష్, నందయ్య, కృష్ణారెడ్డి, చంద్రబాబు, కృష్ణయ్య, దాము, రమేష్, సుబ్రహ్మణ్యం, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## మోదీ, ట్రంప్‌కు లొంగద్దు : సీపీఎం



***పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:*** పుత్తూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో దేశవ్యాప్తంగా రెడ్‌బుక్‌డే జరపడం జరిగింది. అందులో భాగంగా సీపీఎం పుత్తూరు కార్యదర్శి ఆర్ఎంఎస్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఎం జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ మోదీ ట్రంప్‌కు లొంగొద్దని డిమాండ్‌చేశారు. ఈ దేశంలో సుంకాల పేరుతో దేశాలను ట్రంప్ ఆధీనంలో పెట్టుకోవాలని వ్యవహరించడం సరైనది కాదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక చట్టాలను కాల రాయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పర చేయడం, కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో పుత్తూరు సీపీఎం నాయకులు వెంకటేష్, భాస్కర్, బాషా, శివ, సుబ్రహ్మణ్యంపిళ్లె, రమేష్, నరసింహులు, దేవారెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

## ఘనంగా పశు వికాస్ డే

తిరుపతి విద్య, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

ప్రముఖ ఎన్బిఎఫ్సిలలో ఒకటైన ఎస్ఎంఎఫ్జి ఇండియా క్రెడిట్, దాని ప్రధాన పశువుల సంక్షేమం , గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం అయిన పశు వికాస్ దినోత్సవం (పీవీడి)న్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం, పశువుల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, స్థిరమైన పురోగతిని బలోపేతం చేయడం ద్వారా సమగ్ర గ్రామీణ అభివృద్ధికి సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ రవి నారాయణన్ మాట్లాడుతూ 2014లో ప్రారంభించబడిన పశు వికాస్ దినోత్సవం, ఉచిత పశువైద్య సేవలు, నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందించడం ద్వారా పశువుల యజమానుల కీలకమైన ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తుంది.

## సభ్యత్వ నమోదు సమన్వయకర్తగా ఎమ్మెల్యే

తిరుపతి విద్య, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించింది. రెన్యువల్స్ తో పాటు కొత్త సభ్యత్వం పెంచడంతో పాటు జెన్ జీ తరాన్ని జనసేన పట్ల మొగ్గు చెప్పేలా చర్యలు చేపట్టింది. పార్టీ సభ్యత్వ నమోదు పెంపుకు పార్లమెంట్ నియోజకవర్గం ప్రామాణికంగా తీసుకుని సమన్వయకర్తలను నియమించింది. ఇందులో భాగంగా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్తగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును పార్టీ అధిష్టానం శనివారం సాయంత్రం ప్రకటించింది. తిరుపతి జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు పెంపుకు పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్‌తో పాటు సీనియర్స్‌ని, వీర మహిళలని కలుపుకొని కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం గత ఏడాది 16,065 మంది సభ్యత్వంతో మొదటి స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్ లో తిరుపతి పార్టీ నాయకులు, వీర మహిళలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

## ఆర్టీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర



**తిరుపతి రవాణ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళం ఆర్టీఓ కార్యాలయంలో శనివారం వాహన వినియోగదారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి మురళీ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ ప్రాంగణ పరిశుభ్రత , పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు సిబ్బంది, వాహన డీలర్లు, పెద్ద సంఖ్యలో వాహన వినియోగదారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## స్విమ్స్‌లో వైద్యులు, పరికరాలను ఏర్పాటు చేయాలి



***తిరుపతి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :*** నిత్యం వేలాది మందికి వైద్య సేవలం దిస్తున్న తిరుపతి పట్టణంలోని స్విమ్స్ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబులను టిడిపి ఎస్సీ, ఎస్టీ యూనియన్ సభ్యుడు కావేటి మోహన్ కోరారు. శనివారం స్విమ్స్ ఆస్పత్రి ఎదుట వున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు విగ్రహానికి సహచర యూనియన్ సభ్యులతో కలిసి పూలమాల వేశారు. అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలను సమకూర్చాల్సిన అవసరం వుందన్నారు. ముఖ్యమంత్రి ఈ విషయమై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కార్యకర్తలే పార్టీ పటిష్టతకు పునాది : రాహుల్ రెడ్డి



***పుత్తూరు(నగరి), ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :*** కార్యకర్తలే పార్టీ పటిష్టతకు పునాదిలాంటి వారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరి నియోజకవర్గ పరిశీలకుడు రాహుల్ రెడ్డి అన్నారు. శనివారం నగరి పట్టణంలో మాజీ ఆర్.కె.రోజా కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిందన్నారు. ప్రతిపక్ష పార్టీపై దుష్ప్రచారాలతోనే కాలయాపన చేస్తోందని విమర్శించారు. మహిళలను, నిరుద్యోగులను హామీల పేరిట మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు సాధించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ శ్రేణులు పోరాడాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా మేనేజర్ హరికృష్ణ, మునిసిపల్ ఛైర్మన్ పి.జి.నీలమేఘం, వైస్‌ఎంపిపికన్నియప్ప, నాయకులు ఇంద్రారెడ్డి, మురుగయ్య, లీలారామ్, హరి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్‌లో 'జీరో లిటర్ గవర్నెన్స్'పై అవగాహన

- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పిలుపు



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం పెరుమాళ్ళపల్లి గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈనెల థీమ్‌గా 'జీరో లిటర్ గవర్నెన్స్'పై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పాల్గొని గ్రామస్తులకు తడి-పొడి చెత్త వేరు చేయడం, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పంతో ప్రతినెల మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'జీరో లిటర్ గవర్నెన్స్' అంటే చెత్తను బయటకు పడేయకుండా ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి, శాస్త్రీయంగా నిర్వహించడం అని వివరించారు. డ్రైనేజ్‌లో చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిశుభ్రత ఒక్కరోజు కార్యక్రమం కాకుండా రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. 'వేస్ట్ టు ఎనర్జీ' ద్వారా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చెత్తను వేరుచేసి అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలతో 'స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ' చేయించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళపల్లి గ్రామ సర్పంచ్ జోగి మోహన్, ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు, ఎంపిపి విదుదల మాధవరెడ్డి, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడుఎ.ఈశ్వరరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నుల ఆన్‌లైన్‌లో చెల్లించండి



**వడమాలపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ప్రజలు ఇంటి పన్నులు నగదు రూపంలోకాకుండా ఆన్‌లైన్‌లో చెల్లించాలని జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి జి.వి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం వడమాలపేట గ్రామ పంచాయతీలోని ఆయన సందర్శించారు. ప్రభుత్వం స్వర్ణ గ్రామం ద్వారా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీసర్వే, అక్షరాంధ్ర, ఈకేవైసీ, ఇంటి పన్నులు వసూళ్ల మొదలగు అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఈ నెల 28వ తేదీలోగా పూర్తి చేయాలని తెలియజేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామం సిబ్బంది ఇంటి పన్ను నగదు రూపంలో వసూలు చేయరాదని, ఆన్‌లైన్ లేదా ఫోన్‌పే ద్వారా మాత్రమే చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేషగిరిరావు, మండల స్వర్ణ గ్రామం, మండల డిప్యూటీ ఎంపీడీవోలు వల్లిఖాన్, బాలాజీ, పంచాయతీ అభివృద్ధి అధికారులు, స్వర్ణ గ్రామం సిబ్బంది పాల్గొన్నారు.

## మాతృభాషను మరవద్దు

వడమాలపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



పరభాష మోజులో పడి మాతృభాష నిర్లక్ష్యం చేయకండని వడమాలపేట మండలం ఎస్వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ పేర్కొన్నారు. మాతృభాష దినోత్సవం వేడుకలు శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. విద్యార్థులకు పద్య పఠనం, వ్యాసరచన, ఉక్తలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, ఏపీ రంగయ్య, నరసింహారెడ్డి, సుదర్శన్, సూర్యప్రకాష్, ఓంకార్, దామోధర్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారి విధానంలో...దోపిడీ అనివార్యం

సత్యవేడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



రెడ్‌బుక్‌ని పురస్కరించుకుని సత్యవేడు మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో కార్యదర్శి మెలుగు రమేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి దారి సమాజంలో ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో కమ్యూనిస్టు పితామహుడు లెనిన్ రాసిన సామ్రాజ్యవాదం పెట్టుబడి దారి విధానపు అత్యున్నత దశ అనే పుస్తకంపై మాట్లాడారు. నేడు భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులు అడవులు బొగ్గు, నీరు ఖనిజాలు లాంటి వనరులపై కార్పొరేట్ కంపెనీల పెత్తనాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల దేశంలో మరింత దరిద్రం, ఆకలి కేకలు, నిరుద్యోగం, కుల, మతాల ఘర్షణలో ప్రజలు మరింత సంక్షోభంలోకి నెట్టబడతారని తెలిపారు. కార్యక్రమంలో సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి రమేష్, సీపీఎం నాయకులు మురళి, కృష్ణయ్య, మునస్వామి, భాస్కర్, సుశీల, ఎల్లయ్య, మారి నాగవల్లి, పోలమ్మ, నదియా, మారి ముత్తు, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ఓ ఉద్యమంగా మారాలి




**సత్యవేడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పరిసరాలు పరిశుభ్రత విషయంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఇది ఒక సామాజిక ఉద్యమంగా మారాలని తిరుపతి జిల్లా సత్యవేడు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి వెంకట నాగరాజు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి వెంకటనాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, నవ్యాంధ్ర నిర్మాణమే దీన్ని ప్రధాన లక్ష్యమన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా అవసరమన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నేపథ్యంలో విద్యార్థులు ర్యాలీ, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి హరిప్రసాద్, అధ్యాపకులు హన్నా, మురళీమోహన్, వెంకటేశులు, సుధాకర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ పీజీసెట్ 28కు దరఖాస్తులు ఆహ్వానం.

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ పీజీసెట్28కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీజీసెట్ కన్వీనర్, వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ సెట్ పరీక్షకు విద్యార్థులు ఆన్ లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పీజీ సెట్ దరఖాస్తులకు వచ్చేనెల 9వ తేదీతో గడువు ముగుస్తుందని, ప్రవేశ పరీక్ష మే 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడును కలసిన బిజెపి నేతలు



నాయుడుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ను నాయుడుపేట పట్టణానికి చెందిన బిజెపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ను బిజెపి ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి బొల్లాకాయల విజయభాస్కర్, బిజెపి జిల్లా మాజీ కార్యదర్శులు ఆశా చెంచు కృష్ణయ్య,అమరావతి రామయ్య, సర్వాడి చంద్రశేఖర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

## మై టీడీపీ యాప్ ప్రచార హోరు



నాయుడుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు, ఆధునిక సాంకేతికతను సామాన్య కార్యకర్తకు సైతం చేరువ చేసేందుకు పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన మై టీడీపీ యాప్ ప్రచార హోరు నాయుడుపేట పట్టణంలో మిన్నంటింది. ప్రజా క్షేత్రంలోకి మై టీడీపీ పోస్టర్లు పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆదేశాలను శిరసావహించి, సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ మార్గదర్శకత్వంలో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాయుడుపేట పట్టణంలోని 2,13,14,16, 18,20,21 వార్డులను తొలి విడతగా ఎంచుకుని, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రధాన కూడళ్లలో పోస్టర్లను ప్రదర్శించారు. అధ్యక్షుడు 786 రఫీ ఆధ్వర్యంలో సమరశంఖం నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు 786 రఫీ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. లైవ్ రిజిస్ట్రేషన్‌లు వందలాది మంది ప్రజల మొబైల్ ఫోన్లలో కార్యకర్తలు స్వయంగా మై టీడీపీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, వారిని పార్టీ డిజిటల్ విభాగంలో భాగస్వాములను చేశారు.

## నేడు నాయుడుపేటలో విద్యుత్ అంతరాయం

నాయుడుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: నాయుడుపేట టౌన్ 33/11కేవీ సబ్స్టేషన్ నుండి వెళ్లే 11 కెవి సప్తగిరి ఫీడర్ కండక్టర్ వైరు డ్యామేజ్ కారణంగా నూతన కండక్టర్ వైర్ మార్చుటకు అత్యవసర మరమ్మత్తుల కొరకు ఈ నెల 22వ తేది ఆదివారం ఉదయం 9.00 గంటల నుండి 2.00 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి ఏఈ శివశంకర్ ఒ ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట పట్టణంలోని బి ఎం ఆర్ నగర్, బాలాజీ గ్రీన్ సిటి, బోపయ్య కాలనీ, కోళ్ల ఫారం, ఆవని హోమ్స్, కాళహస్తి బైపాస్ రోడ్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడునని నాయుడుపేట ప్రజలకు వారు తెలియజేశారు.

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తడ,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు శనివారం తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మండల విద్యాశాఖ అధికారి వేములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అమ్మ భాష మాతృభాష అని ఏ దేశమేగినా మన మాతృభాషను మరవకూడదని మాతృభాష తెలుగు వైభవాన్ని చాటి చెప్పిన శ్రీకృష్ణదేవరాయలు గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, గుర్రం జాషువా, వేషధారణలో విద్యార్థు అలరించారు ఉపాధ్యాయులు తెలుగుజాతి గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు.

## కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్



వెంకటగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఈగ కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ మేనేజర్ సాంబశివయ్య నూతన కమిషనర్ అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. అందరి సహాయ సహకారాలతో మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సాంబశివయ్య, శాంతిని ఇన్స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు. కమిషనర్‌కు స్వాగతం పలికారు.

## వెంకటగిరి ఎమ్మెల్యే సీఎం ఫండ్ చెక్కులు పంపిణీ



వెంకటగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: గత వైసిపి ప్రభుత్వం అవినీతి మయంగా సాగిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణ తెలుగు గంగ అతిథి గృహంలో వెంకటగిరి రూరల్, కలువాయి, రాపూర్, సైదాపురం మండలాల్లోని లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే సీఎం ఫండ్ చెక్స్ పంపిణీ చేసారు. గత వైసిపి ప్రభుత్వం అవినీతి మయంగా సాగిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, ఎంపీపీ తనుజా రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వేదాంగ పండితులు రామ్మూర్తి ఘనపాటికి కన్నీటి వీడ్కోలు

**-టిటిడి వేదపాఠశాల అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలు**
**-రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రముఖ దేవాలయాలలో ఆయన శిష్యులు**





చంద్రగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: వేదపండితులు బ్రహ్మశ్రీ రామ్మూర్తి ఘనాపాటికి తన శిష్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. వేద వేదాంగములను ఔపాసన గావించి వేద ఋషి రామ్మూర్తి ఘనాపాటి చంద్రగిరి మండలం, దిగువ రెడ్డివారిపల్లిలోని తన స్వగృహంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. యావత్ భారతదేశంలో ఋగ్వేదం, యజుర్వేదం, సాంగోపాంగంగా షడంగములు, వేదార్థం, వేదశాస్త్రాలను అధ్యయనం చేసిన అత్యున్నతమైన అతి కొద్ది మంది ప్రముఖులలో మన రామ్మూర్తి ఘనపాటి ఒకరు కావడం మన జిల్లాతో పాటు యావత్ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నది. ప్రపంచ ప్రఖ్యాత తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలోని వేదపాఠశాలలో విద్యార్థిగా తన ధశను ప్రారంభించి అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలందించిన ఘనాపాటి వేలాది మంది శిష్యులను పండితులుగా తీర్చిదిద్ది ఘనత వహించారు. పదవీ విరమణ అనంతరం దిగువరెడ్డిపల్లిలోని తమ నివాసంలో తన శిష్యుల పిల్లలకు వేదం, వేదశాస్త్రం, జ్యోతిష్యం నేర్పుతూ తన శేషజీవితానికి వన్నె తీసుకువచ్చారు. ఆయన వద్ద విద్య నేర్చుకున్న శిష్యులు నేడు రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రముఖ దేవాలయాలు తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, మహానంది, శ్రీశైలం, భద్రాచలం, వేములవాడ, విజయవాడ కనకదుర్గ, సింహాచలం, యాదగిరి గుట్ట, ప్రముఖ టిటిడి వేదపాఠశాల, యూనివర్శిటీ, కంచికామకోటి పీఠం వేదపాఠశాల వంటి అనేక ప్రాంతాలలో వేర్వేరు స్థాయిల్లో వేదపండితులుగా వుండటం విశేషం, ఈ నేపథ్యంలో తమ గురువు మరణవార్త విని హుటాహుటిన దిగువరెడ్డివారిపల్లికి చేరుకుని నివాళులర్పించి, అంతిమ యాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## సమయస్ఫూర్తితో ప్రధాన ఉత్సవాలు విజయవంతం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఉత్సవాల్లో సమయపాలన,పరిపాలనలో సమయస్ఫూర్తితో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలు విజయవంతం అయ్యాయి. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రెండు సార్లు సమీక్షించారు. ఉత్సవాల నిర్వహణ బాధ్యతను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి సుబ్బరాయుడుకు ఇఓ బాపిరెడ్డికి అప్పగించారు. వారు ఇక్కడ తిష్టవేసి ప్రణాళికలు రచించారు. కృషి,పట్టుదల,జవాబుదారి తనం ఉంటే ఎంతటి క్లిష్ట కార్యక్రమాల్ని అయినా సునాయాశంగా విజయవంతం చేయవచ్చునని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి నిరూపించారు. గత ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించిన ఆయన లోటు పాట్లునుగుర్తించారు. ఏ పని ఆలస్యం జరగకుండా ఇంజనీరింగ్ విభాగం పనులు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇఓ బాపిరెడ్డి తీసుకున్న సంస్కరణలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లోని ప్రధాన ఉత్సవాల విజయానికి సహకరించాయి. ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినాన సుమారు లక్షమందికి పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు అంచనా. ప్రతి భక్తుడూ క్యూలైన్లలో వెళ్ళటం, సామాన్యభక్తుడైనా విఐపి,వివిఐపిలు ఎవరైనా ఒక్కటే అని ఆయన సుదర్శనంకు అవకాశం కల్పించి శభాష్ అనిపించుకున్నారు. అలాగే శివరాత్రి పర్వదినాన ప్రత్యేకంగా నిర్వహించే 'లింగోద్భవ అభిషేకంలో' కూడా చొరవ చూపటంతో సామాన్య భక్తునికి కూడా లింగోద్భవ అభిషేకం దర్శనం లభించింది. ఇక్కడ ఆయన ప్రదర్శించిన సమయపాలన,సమయస్ఫూర్తి ఎంతో ఉపకరించాయి. ఉత్సవాలకు ముందు ఇఓ, శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రకటించినట్లే 'నభూతో'అని నిరూపించుకున్నారు. సిబ్బందిలో కూడా జవాబుదారి తనం పెరిగింది.అన్ని శాఖల అధికారులు,సిబ్బంది తమ ఇంటి కార్యక్రమాలుగా నిర్వహించారు.

## శ్రీసిటీని సందర్శించిన మాజీ డీజీపీ



సత్యవేడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) ఎం.మాలకొండయ్య శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ఇతర కార్యకలాపాలను వివరించారు. శ్రీసిటీ విజన్, ప్రణాళిక, అమలు తీరును ప్రశంసించిన మాలకొండయ్య దేశంలో ఆదర్శ పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ నిలుస్తుందని పేర్కొన్నారు. స్థానికులకు, మహిళలకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు రవీంద్ర సన్నారెడ్డి, ఆయన బృందాన్ని అభినందించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన ఇసుజు, మోండెలీజ్, బ్లూస్టార్ ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించి, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. అలాగే క్రియా యూనివర్సిటీ, చిన్మయ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. మాలకొండయ్యను శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బి.వి.శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలసి ఈ ప్రాంతంలో అమలవుతున్న భద్రతా చర్యలు, శాంతి భద్రతల పరిస్థితులను వివరించారు.

## ఎస్వీయూలో బయట వ్యక్తుల హల్చల్

**-అధికారులు తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్**



తిరుపతి విద్య, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఎస్వీయూ హాస్టల్స్ లో అనధికారికంగా బయట వ్యక్తులు తిష్ట వేశారని, తక్షణం అధికారులు జోక్యం చేసుకుని వారిని బయటకు పంపాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ అప్పారావును విద్యార్థులతో కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ వసతిగృహాలలో బయట వ్యక్తులు నివసిస్తూ విద్యార్థులకు సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ బ్లాక్ వసతి గృహంలో మరింత మంది బయట వ్యక్తులు తిష్టవేయడం విద్యార్థులు త్రాగునీటికి, వాష్ రూమ్ వినియోగంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే వర్సిటీలో కోర్సులు పూర్తైన అభ్యర్థులు సైతం విద్యార్థి నాయకుల పేరుతో చలామణి అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చెల్లించే ఫీజులతో బయట వ్యక్తులు సౌకర్యాలను అనుభవిస్తూ హల్చల్ చేస్తున్నారని విమర్శించారు. తక్షణం అధికారులు వర్సిటీలోని హాస్టల్స్‌ను తనిఖీ చేసి అనధికారికంగా నివసిస్తున్న వ్యక్తులను బయటకు పంపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఈ బ్లాక్ విద్యార్థులతో పాటు జేఏసీ సభ్యులు ప్రకాష్, కళ్యాణ్, ప్రేమసాగర్, మహేంద్ర పాల్గొన్నారు.

## స్విమ్స్ రేడియేషన్ ఆంకాలజిలో చైర్ ఓరియేషన్




తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) రేడియేషన్ ఆంకాలజి విభాగం వారి ఆధ్వర్యంలో రేడియోధార్మికతను అధిగమించడం హైపర్థర్మియా పాత్ర అనే అంశంపై 8వ వార్షిక ఛైర్ ఒరేషన్ కార్యక్రమాన్ని శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఛైర్ ఒరేటర్‌గా విచ్చేసిన డా. బాలబాయ్ నానావతి హాస్పిటల్, ముంబాయి నుండి ఛైర్ ఒరేటర్‌గా చీఫ్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా. నాగరాజ్, డా. నాగరాజ్ గురురాజ్ హులిగల్, ముఖ్య అతిథిగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్, రేడియేషన్ ఆంకాలజి విభాగాధిపతి డా బి.వి.సుబ్రమణియన్, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా. నరేంద్ర, పాథాలజీ విభాగాధిపతి డా. రుగ్మంగద, ప్రొఫెసర్ ఆర్.ఓ. ఉపశమన సంరక్షణ విభాగాధిపతి డా. ప్రాణబందు దాస్, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డా నాగరాజు, నర్సింగ్ కాలేజ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. నాగరత్నమ్మ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా. బాలబాయ్ నానావతి హాస్పిటల్, ముంబాయి నుండి ఛైర్ ఒరేటర్‌గా చీఫ్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా. నాగరాజ్ గురురాజ్ హులిగల్, రేడియేషన్ ఆంకాలజి రంగానికి విశేష సేవలు అందించారని వారి ప్రతిభను గుర్తించి ఒరేటర్‌గా ఈ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇంట్రాపెరిటోనియల్ కెమోథెరఫి, మాగ్నెటిక్ హైపెథెర్మియా వంటి పద్ధతులలో కీమోథెరపీ మందుల ప్రభావాన్ని పెంచడానికి ఉపయోగిస్తారు కణితి లోపలికి ఔషధం చొచ్చుకుపోయే సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్.వి.కుమార్ ముఖ్య అతిథి డా. నాగరాజ్ గురురాజ్ హులిగల్‌ని, గోల్డ్ మెడల్‌తో సత్కరించి, జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎం.ఎ ప్రెసిడెంట్ డా ఎఆర్‌రెడ్డి, రుయా మాజీ సూపరింటెండెంట్ డా భారతి, స్విమ్స్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రలజీ విభాగాధిపతి డా.శివరామ్, ఆర్ఎంఒ డా.కోటిరెడ్డి, రేడియేషన్ వైద్యులు డా.శ్రీనివాస్, డా.దీప్తి రేడియేషన్, సర్జికల్, మెడికల్ ఆంకాలజి విభాగాల వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు శిల్పారామంలో రాష్ట్ర చేనేత మేళా

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : శిల్పారామంలో రాష్ట్ర చేనేత మేళా - 2026ను ఈ నెల 22వ తేది నుంచి మార్చి 07 వరకు మొత్తం 14 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలో మొత్తం 60 స్టాళ్లు ఏర్పాటు చేయబడ్డాయి. వాటిలో 48 చేనేత స్టాళ్లు మరియు 12 హస్తకళల స్టాళ్లు ఉన్నాయి. జాతీయ సమగ్రతను పెంపొందిస్తూ, సంప్రదాయ చేతివృత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మేళాను నిర్వహిస్తున్నారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్తకళ కళాకారులు తమ ప్రత్యేక ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ మేళా ద్వారా వినియోగదారులకు నాణ్యమైన చేనేత వస్త్రాలు మరియు విశిష్ట హస్తకళ ఉత్పత్తులు ఒకే వేదికపై లభిస్తాయి. చేనేత కార్మికులకు విస్తృతమైన మార్కెట్ అవకాశాలు కలగడంతో పాటు, వారి కళా నైపుణ్యాలకు మరింత ప్రాచుర్యం లభిస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులవర్తి వెంకట మణి ప్రసాద్ (నాని), శాసనసభ్యులు, చంద్రగిరి హాజరై మేళాను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు, జిల్లా శాసనసభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అందరు ప్రజలు ఈ హత్కర్ఘ మేళాను సందర్శించి, చేనేత మరియు హస్తకళ ఉత్పత్తులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు. మీడియా మిత్రులు ఈ సమాచారాన్ని నగర ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు సహకరించాలని కోరారు.

## నేడు ఏకాంత సేవ

శ్రీకాళహస్తి-ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 'ఏకాంత సేవ'కు ఎంతో ప్రాధాన్యత ఉంది.మంగళవారం రాత్రి అమ్మవారి గర్భగుడికి పక్కనే పురాతన కాలంలో శయన మందిరాన్ని నిర్మించారు.దీనిని పళ్ళియార అంటారు.ఇక్కడ ప్రతి రోజూ రాత్రి ఆలయంలోని గర్భగుడుల్లో గల పళ్ళియారలో గల ఊయల్లో శయనింపజేయటం ఆనవాయితి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం తరువాత 'ఏకాంతసేవకు' ఎంతో ప్రాధాన్యత ఉంది.మన సంప్రదాయాల్లో కళ్యాణం తరువాత ఏర్పాటు చేసే శోభనంను పోలి ఏకాంతసేవ నిర్వహించటం ఆనవాయితి.ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పళ్ళియారను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని పూల సొబగులతో ఆకట్టుకునే విధంగా ముస్తాబు చేయాలని ఇఓ ఆదేశించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు



బాలాయపల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త ఉపాధి ఆమె పథకంలో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని అంబలపూడి, బాలాయపల్లి గ్రామాల్లో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సివి శ్రీనివాస ప్రసాద్, ఏపీఓ జ్యోతి, ఈసి సుధీర్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. రూ.5 లక్షలతో చేపడుతున్న ఫిషింగ్ పాండ్ పనులు, రూ.6 లక్షలతో అంబలపుడి సీసీ రోడ్డు పనుల చూశారు. పనులు నాణ్యతగా చేపట్టాలి లేకుంటే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. కూలీలందరికీ పనులు కల్పించాలని తెలిపారు.

## కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె పోటు వచ్చిన వారికి ఉచితంగా 50 వేల రూపాయలు విలువ కలిగిన ఇంజక్షన్ వేస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో వైద్య రంగాన్ని నిర్వీర్యం చేశారని చెప్పారు. ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స చేసుకోవాలని తెలిపారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పనితీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళి రెడ్డి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## భూదేవమ్మ కుటుంబ సభ్యులను పరామర్శ



వాకాడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొందూరు పంచాయతీలోని అందల మాల గ్రామానికి చెందిన వైసిపి నాయకురాలు భూదేవమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినది. శనివారం సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఎంపీ, బిజెపి నాయకుడు డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు ఆయనతో పాటు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి స్వగృహానికి వెళ్లి దివంగత భూదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావుతో తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, ఉన్నారు.

## ఘనణీయంగా గుడిమల్లం శివరాత్రి ఆదాయం



ఏర్పేడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: గుడిమల్లంలోని శ్రీపరశురామేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి ఆదాయం వివిధ సేవలు, హుండీ ద్వారా సుమారు రు.11లక్షలు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. మహాశివరాత్రికి టిక్కెట్లు ద్వారా రు.5.20లక్షలు, చందాల ద్వారా రు.2లక్షలు, ఆన్‌లైన్ సేవలు ద్వారా రు.2.60లక్షలు వచ్చిందన్నారు. అలాగే స్వామివారికి పుష్పాలంకరణ కోసం రు.1.60లు, హుండీల ద్వారా రు.6.30లు వచ్చాయన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బత్తల గిరి నాయుడు, కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి, దేవాదాయశాఖ తిరుపతి డివిజన్ ఇన్స్పెక్టర్ పణిరాజ సేన, పాలకమండల సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాతృభాష తల్లి పాల వంటిది : ప్రిన్సిపల్



పుత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : మాతృభాష తల్లి పాల వంటిదని, పరభాష పోత పాల వంటిదని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా శనివారం కాలేజీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అనేక మాతృభాషలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాష అనేది ఒక జాతి సంస్కృతి, సంప్రదాయాలు, విలువలకు ప్రతిబింబమని తెలిపారు. ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పు లేదని, కాని మాతృభాషను మరిచిపోకూడదని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలు తెలుగులోనే వుండాలని, తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ, నిధులను ఏర్పాటు చేయాలని తదితర ఏడు తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు. విద్యార్థినీ, విద్యార్థులకు మాతృభాషపై వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు, టి.నరసింహులు, డాక్టర్ పూజారి వెంకటేశన్, డాక్టర్ పి.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఇఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, దిలీప్ రెడ్డి, అర్చకులు ఆంజనేయాచార్యులు, జమేధర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## చెత్త రహిత తిరుపతిలో భాగస్వామ్యం కావాలి




తిరుపతి,పిబ్రవరి 21ప్రభాతవార్త: తిరుపతిని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యంఅ వసరమని నగర కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. వ్యర్థాల నిర్వహణ, తడిపోడిచెత్త సేకరణపై అవగాహన కల్పించారు.

## ప్రజాదర్బార్‌లో సుగుణమ్మ



తిరుపతి, పిబ్రవరి 21ప్రభాతవార్త : తిరుపతి నియోజకవర్గంలోనే తమ సమస్యలపై శనివారం ప్రజాదర్భార్ లో సుగుణమ్మకు ప్రజలు విన్నవిఒచారు. కొన్నిటిని పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.పుష్పావతియాదవ్, బుల్లెట్‌రమణ, మునిశేఖర్‌రాయల్, మురళి, విశ్వనాథం, సుజాత పాల్గోన్నారు.

## భక్తిభావంతో నగరసంకీర్తన



తిరుపతి, పిబ్రవరి 21ప్రభాతవార్త: తిరుపతిలో రాయలసీమ రంగస్థలం ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువ జామున నగరసంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, కన్నప్పగారి కేశవులు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, అరుణ,జయమ్మ, సిద్ధమ్మ, పార్వతి, మునేంద్ర, కల్పన, ఉష, కస్పా పద్మనాభం, నరసింహారెడ్డి, లోకప్రభాకర్‌నాయుడు, మధు, పోన్నాల జేజిరెడ్డి, పద్మావతి, శ్రావణి తదితరులు భక్తి,ఐక్యత, సేవా భావాల సమ్మేళనంగా ఈ నగరసంకీర్తన చేపట్టారు.